క్లుప్తంగా

'ఇస్తెమా'కు సహకరిస్తాం



ఇస్తెమా నిర్వాహకులతో మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి

హిందూపురం: ముస్లిం మైనార్టీలు చేపడుతున్న ఇస్తెమాకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి అన్నారు. ఈ నెల 6, 7 తేదీల్లో హిందూపురం సమీపంలోని పరిగి రోడ్డులో నిర్వహించనున్న ఇస్తెమా గాఫ్ ప్రాంతానికి ఆదివారం వైస్ చైర్మన్ జబీవుల్లాతో కలసిని ఆయన పరిశీలించారు. ముస్లిం మైనార్టీలలకు వైఎస్సార్‌సీపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. మెడికల్ క్యాంపు సిబ్బందితో మాట్లాడి ఎమర్జెన్సీ సమయంలో విశ్వతేజ హాస్పిటల్ డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి సంప్రదించాలని సూచించారు.

మనిషిలోని దుర్గుణాలపై తిరుగుబాటే సంక్రాంతి



భగవద్గీత గ్రంథాన్ని అందిస్తున్న దృశ్యం

పరిగి: మనిషిలోని దుర్గుణాలపై తిరుగుబాటే సంక్రాంతి పండుగ అని భగవద్గీత త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు ఆదినారాయణ తెలిపారు. మండలంలోని పైడేటిలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథంపై ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్రాంతి విశిష్టత, భోగి, మకర పర్వదిన విశేషాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుభద్ర, పార్వతి, మమత, సరస్వతి, కళ, జ్యోతి, మునీంద్ర, క్రిష్టప్ప, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

9న సామాజిక తనిఖీపై బహిరంగ సభ

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈనెల 9వ తేదీన 18వ విడత సామాజిక తనిఖీపై బహిరంగా సభను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామరావు, ఎస్ఆర్పీ తిరుమలేష్ తెలిపారు. రొళ్ల మండల వ్యాప్తంగా పది పంచాయతీలో ఉపాధి పథకం ద్వారా 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకూ 577 పనులకుగాను రూ.4.51 కోట్లు ఖర్చు పెట్టారు. వెచ్చించిన నిధులకు, చేపట్టిన పనులు క్షేత్రస్థాయిలో సక్రమంగా ఉన్నాయా లేదా అన్న విషయాన్ని తనిఖీ బృందం పరిశీలించి నివేదికలు తయారు చేస్తోందన్నారు. తనిఖీలో వెల్లడైన అంశాలను బహిరంగా సభ ద్వారా విజిలెన్స్, డ్వామా అధికారుల ఎదుట వెల్లడిస్తామన్నారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ



అబాకస్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

పెనుకొండ: పట్టణంలోని బ్రిలియన్స్ స్కూల్ విద్యార్థులు అబాకస్ జూనియర్, సీనియర్ కాంపిటీషన్స్‌లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ నాగవేణి తెలిపారు. జిల్లాస్థాయి ఇంటర్ స్కూల్ సీనియర్, జూనియర్ అబాకస్ పోటీలు ఆదివారం ధర్మవరంలోని ఆదిత్య స్కూల్‌లో జరిగాయన్నారు. జాయ్‌తేజ్, జాహ్నవి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారని పేర్కొన్నారు.

కొనసాగుతున్న స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణ



శిక్షణలో పాల్గొన్న శిక్షకులు

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ రెసిడెన్షియల్ ఎక్సలెన్స్ పాఠశాలలో జిల్లా స్థాయి స్కౌట్ అండ్ గేమ్స్ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఆదివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ అంశాలలో శిక్షణతో పాటూ మెలకువలను నేర్పించారు. అనంతరం ప్రయోగాత్మకంగా విద్యార్థులతో పాటు శిక్షణ పొందుతున్న వారికి స్కౌట్ అండ్ గైడ్స్‌పై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 27 పాఠశాలలకు చెందిన శిక్షకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రొళ్ల: మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి తెలిపారు.

ఇంటి వద్దకే వచ్చి సరుకులివ్వాలి



గత ప్రభుత్వంలో ఎండీయూ వాహనం ఇంటి వద్దకే వచ్చి నిర్ణీత సమయంలో లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా రేషన్ సరుకులను పంపిణీ చేసేది. బియ్యం ఏ ఒక్కరూ పనులు మానుకుని ఎదురు చూసే వారు కాదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ కోసం కూలి పనులు మానుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఓ పూట పని మానుకుని సరుకుల కోసం వెళ్లినా షాపు తెరుస్తారో లేదో అనుమానమే. ఏ రేషన్ దుకాణం చూసినా క్యూలైన్లతో నిండిపోతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లాగా ఇంటి వద్దకే ఎందుకు సరుకులు ఇవ్వకూడదు?

– ఈరన్న, వైఎస్సార్‌సీపీ నాయకుడు, అగళి

ప్రభుత్వం మారితే పథకాలు మార్చాలా?



ఇదేమి రాజ్యమో నాకు అర్థం కావడం లేదు. ప్రభుత్వం మారితే పథకాలు మార్చాలా? ప్రజల కష్టాలకు అనుగుణంగా పాలన చేసిన ప్రభుత్వాలను ప్రజలు చిరస్థాయిగా గుర్తించుకుంటారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిత్యావసరాలు ఇంటి వద్దకే అందించారు. రేషన్ దుకాణాల వద్ద గంటల తరబడి నిలబడే అవసరం ఉండేదికాదు. కానీ ప్రస్తుతం బియ్యం పొందాలంటే చౌకధాన్య డిపోల వద్ద రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. గత ప్రభుత్వం చేసిన మేలును కొనసాగించాలి. కూటమి ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలని కోరుతున్నా.

– నరేంద్రరెడ్డి, ఊటుకూరు, పరిగి మండలం

పక్క గ్రామానికి వెళ్లాల్సిందే..



రేషన్ సరుకులు తీసుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. గ్రామంలో 65కు పైగా రేషన్ కార్డులున్నా చౌకధాన్యపు డిపో లేదు. దీంతో పక్క గ్రామానికి నడిచి వెళ్లడానికి వీలులేకపోవడంతో మా ఇంట్లోని అవ్వతాతలు రెండు నెలల నుంచి రేషన్ సరుకులను తీసుకోలేదు. ఈ నెలలో మాత్రం సరుకులను తీసుకున్నారు. గ్రామంలోనే రేషన్ పంపిణీ చేయాలని పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా వాళ్లు ఏ మాత్రం పట్టించుకోలేదు. ఇప్పటికైనా మా కష్టాలు తీర్చాలి.

– అదిశేషు, గౌరిపురం, మడకశిర మండలం

రేషన్.. పరేషాన్!

- ప్రభుత్వమిచ్చే బియ్యం కోసం లబ్ధిదారుల అవస్థలు
- ఏ రేషన్ దుకాణం వద్ద చూసినా బారులు తీరిన కార్డుదారులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గుర్తు చేసుకుంటున్న జనం
- ఇంటి వద్దకే ఎందుకు తెచ్చివ్వలేకపోతున్నారని అసంతృప్తి



హిందూపురంలోని ఆబాద్‌పేటలో రేషన్ కోసం క్యూ కట్టిన లబ్ధిదారులు

పబ్లిక్ పల్స్ సమస్యపై ప్రశ్నిద్దాం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ సరుకుల కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఒకటో తేదీ వచ్చినప్పటి నుంచి రేషన్ దుకాణాల ఎదుట పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. రేషన్ బియ్యం ఎప్పుడు వేస్తారో కూడా తెలియడం లేదని హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యం కోసం పనులన్నీ మానుకొని క్యూలైన్లలో నిలబడి అవస్థలు పడి తీసుకుంటున్నామని వాపోతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే వచ్చి నిత్యావసర సరుకులు పకడ్బందీగా అందించే వారని చెబుతున్నారు. అప్పటి లాగే ఇప్పుడు ఎందుకు చేయలేకపోతున్నారని ప్రశ్నిస్తున్నారు.

: సాక్షిబృందం



అమరాపురంలో రేషన్ షాపు వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు

గతంలో ఇలాంటి కష్టాలు లేవు



రేషన్ సరుకులకు వెళ్తే గంటల తరబడి క్యూ లైన్ నిలుచోవాల్సిన పరిస్థితి నెలకొంది. అంత సేపు నిల్చున్నా ఒక్కోసారి సర్వర్ పని చేయలేదు. మళ్లీ రావాలని పంపిన సందర్భాలు ఉన్నాయి. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇలా గంటలు గంటలు లైన్‌లో నిల్చుని రేషన్ తీసుకునే పని ఉండేది కాదు. మా ఇంటి వద్దకే వచ్చి రేషన్ అందించేవారు. ఇలాంటి కష్టాలు పడేవాళ్లం కాము.

– సింధు, సూగూరు, హిందూపురం



రొళ్ల మండలం దొడ్డేరిలో ఒకే చోట లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

రేషన్ పంపిణీ అస్తవ్యస్తం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయరైంది. సరుకులు తీసుకోవాల్సింటే గంటల తరబడి క్యూలైన్లో నిల్చోవాల్సిన దుస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయంలో రేషన్ సరుకులను ప్రభుత్వమే వాహనాల ద్వారా ఇంటి వద్దకే చేర్చేది. దీంతో వృద్ధులు, అనారోగ్యంతో బాధపడే లబ్ధిదారులకు ఎంతగానో ఉపయోగంగా ఉండేది.

– హరిజన మారేప్ప, గోరంట్ల

పనులు మానుకుంటున్నాం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లాగానే ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులను పంపిణీ చేయాలి. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం ఎఫ్‌పీ షాపుల ద్వారా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తుండం వలన అన్ని పనులకు ఇబ్బందులు పడుతున్నాము. బియ్యం తీసుకోవడానికి వెళ్లిన రోజు అన్ని పనులను వదులు కోవాల్సిందే.

– ఆనంద్, కంచిసముద్రం, లేపాక్షి మండలం

గతంలోనే బాగుండేది



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హాయంలోనే సమయానికి రేషన్ బియ్యం ఇచ్చేవారు. ఇంటి వద్దకు వచ్చి మరి సరఫరా చేసే వారు. కానీ కూటమి ప్రభుత్వ హయాంలో గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తోంది. నేను వికలాంగుడిని. సర్వర్ పని చేయలేదంటే రెండు మూడు సార్లు ఎఫ్‌పీ షాపుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా మా బాధలు అర్థం చేసుకొని ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలి.

– ఓబుల్‌రెడ్డి, సోమందేపల్లి

కూలి పనులు మానుకొని పడిగాపులు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వం ట్రక్కు ద్వారా ఇంటి వద్దకే నిత్యావసర సరుకులను అందించేది. ఎప్పుడు నేను చౌక దుకాణం వద్దకు వెళ్లలేదు. ప్రస్తుతం కూలీ పనులు వదులుకుని నిత్యావసర సరుకుల కోసం రేషన్ షాపు వద్దకు వెళ్తున్నాను. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నా.

– మానస, కెంకెర, అమరాపురం మండలం

ప్రతి నెలా ఇబ్బంది పడుతున్నాం



రేషన్ బియ్యం కోసం ప్రతినెలా రేషన్ షాపు వద్ద పడిగాపులు కాస్తున్నాం. ఒకటో తేదిన రేషన్ అందించాల్సి ఉంది. అయితే ఐదు రోజులు తర్వాత సరుకులు పంపిణీ చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నేరుగా ఎండీయూ ఆపరేటర్ల ద్వారా ఇంటింటికీ వచ్చి సరుకులు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. జగన్ ప్రభుత్వం ఉండి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు.

– హనుమంతరాయప్ప, టీడీ పల్లి, రొళ్ల మండలం

కేంద్ర మంత్రికి వినతుల వెల్లువ



రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్నకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రారంభోత్సవానికి విచ్చేసిన కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్నకు ప్రజలు, ప్రజా సంఘాలు, పలు రాజకీయ నాయకులు సమస్యలపై ఆదివారం వినతులు అందించారు. ఓవర్ బ్రిడ్జి సభాస్థలికి వచ్చిన కేంద్ర మంత్రికి బీజేపీ నాయకులు గోపీనాథ్ తదితరులు గజమాలతో సన్మానించారు. అనంతరం పెనుకొండను రైల్వేజోన్‌గా మార్చాలని, కుర్లా, బసవ ఎక్స్‌ప్రెస్‌లను పెనుకొండలో ఆపేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే నరసాపురం, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ను బెంగళూరు వరకూ పొడిగించాలని, హౌరా ఎక్స్‌ప్రెస్‌ను పెనుకొండలో ఆపాలని, ప్యాసింజర్‌ను ధర్మవరం మీదుగా అనంతపురం వరకూ నడపాలని, పెనుకొండ రైల్వేస్టేషన్‌లో కనీస సౌకర్యాలను తీర్చేలా తగిన నిధులు మంజూరు చేయాలని కోరారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన రామాంజినేయులు, శ్రీరాంయాదవ్, ఎంఎస్. మూర్తి, హరిలాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చాకర్లపల్లి రైల్వేస్టేషన్ ప్రారంభించండి

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి రైల్వేస్టేషన్‌ను ప్రారంభించాలని స్థానికులు కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి వి.సోమన్నకు వినతిపత్రం అందజేశారు. పనులు పూర్తయినా రైల్వే అధికారులు స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకురాలేదన్నారు. అదే విధంగా ప్యాసింజర్ రైలు ఆపే విధంగా చూడాలన్నారు. నెలరోజుల్లో స్టేషన్‌ను ప్రారంభించడంతో పాటు రైలు ఆపేల చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే బ్రిడ్జి పనులు ఏడాదిలోపు పూర్తి చేసి సమస్య లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు.



పైడేటిలో సుబ్రహ్మణ్య రథోత్సవం



అమరాపురం మండలం గౌడనకుంట పుట్ట వద్ద మహిళల పూజలు

వైభవంగా సుబ్రహ్మణ్య షష్టి

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో సుబ్రహ్మణ్యేశ్వర షష్టిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్యంగా సుబ్రహ్మణ్యుడి ఆలయాల్లో ఆదివారం ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో మొక్కులు చెల్లించుకున్నారు. కొన్నిచోట్ల సుబ్రహ్మణ్యుడి బ్రహ్మ రథోత్సవం వైభవంగా సాగింది.



హిందూపురంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం

పేద విద్యార్థిని చదువుకు చేయూత



విద్యార్థిని తండ్రికి ఆర్థిసాయం అందజేస్తున్న దృశ్యం

లేపాక్షి: హిందూపురం పట్టణంలోని నరసింహారెడ్డి కుమార్తె మహాలక్ష్మి గత ఏడాది నంద్యాల శాంతారాం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సాధించింది. డాక్టర్ కోర్సు చేయించడానికి విద్యార్థిని తండ్రికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో రెడ్డి సంఘం ప్రతినిధులు ముందుకు వచ్చి మొదటి ఏడాది కోర్సుకు అయ్యే ఖర్చు భరించారు. అయితే తాజాగా డాక్టర్ కోర్సు పూర్తి చేయించడానికి ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో స్థిరపడిన లక్ష్మీపతి కుమారుడు హరికిషోర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి మహాలక్ష్మి ఎంబీబీఎస్ పూర్తయ్యే వరకు ఎంత ఖర్చు అయినా భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో లేపాక్షిలోని అన్నదానం సత్రంలో ఆదివారం మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి ద్వారా విద్యార్థినికి దుస్తులు, ప్రయాణపు ఖర్చులకు ఆమె తండ్రి నరసింహారెడ్డికి రూ. 10 వేలు ఆర్థికసాయం చేశారు. వైస్ ఎంపీపీ అంజనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ధర్మవరం రూరల్: గొల్లపల్లి సమీపంలో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల.. ధర్మవరం గాంధీనగర్‌కు చెందిన ఆదిమూర్తి, బడన్నపల్లికి చెందిన రాజారెడ్డి, కార్తీక్‌రెడ్డి మరూరు గ్రామానికి బైక్‌పై బయలుదేరారు. మరూరు గ్రామానికి చెందిన మూర్తి అనే వ్యక్తి బైక్‌పై ధర్మవరం వైపు వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అమ్మాయిలకు ఆత్మస్థైర్యం ముఖ్యం



ఏఎం లింగణ్ణ విద్యా సంస్థల్లో ప్రతిభావంతులకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న దృశ్యం

పరిగి: సమాజంలో రోజు రోజుకూ బాలికలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు చెక్ పెట్టాలన్న లక్ష్యంతో ‘బాల వికాస వేదిక’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము. దీని ద్వారా అమ్మాయిలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లే విధంగా ప్రోత్సహిస్తున్నాం’ అని బాల వికాస్ వేదిక సభ్యురాలు హేమావతి అన్నారు. యోగా, కరాటే, డ్రామా, నృత్యం, పద్యాలు, సమాజంలో జరుగుతున్న చెడు, మంచిని వివరిస్తున్నామని పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కొడిగెనహళ్లిలో బాల వికాస్ వేదిక ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగానే నిర్వహించిన వక్తృత్వపు పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంసాపత్రాలను, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమాల్లో పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ‘పురం’లో ఇస్తెమా



భోజనాలు చేసేందుకు ఇలా..



వజూ ఖానా

హిందూపురం: పట్టణంలోని పరిగి రహదారి వద్ద సోమ, మంగళ వారాల్లో ఊమీ ఇస్తెమా గాహ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఢిల్లీ నుంచి వస్తున్న మతపెద్దలు బయాన్ (ప్రసంగాలు) సాగుతాయి. సోమవారం మధ్యాహ్నం నుంచి అల్లాపై విశ్వాసం, భక్తిభావం వంటి వాటిని వివరిస్తారు. హిందూపురం చుట్టు పక్కల ప్రాంతాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివస్తున్న ముస్లింల కోసం భోజనాలు, వసతి, ఇతర సదుపాయాలన్నీ కల్పిస్తున్నారు.





ఇస్తెమాకు వచ్చే ముస్లింలు కూర్చుని వినేలా ఏర్పాట్లు , హోటళ్ల నిర్వహణ కోసం తాత్కాలిక ఏర్పాట్లు